# ప్రమో(మా)దం

రొడీషియా రాయభారి మాబాబే రాబే పోబే మాస్కో వచ్చిన సందర్భంగా రష్యా రాయబారి నవ్వకో యర్వకోయ్ పెద్ద విందు ఏర్పాటు చేశాడు. ఎందరో అతిథులు వచ్చారు. రకరకాల వినోదాలు ఏర్పాటు చేయబడ్డాయి. మాబాబే ఏదో మాట్లాడుతూ "ఓడ్కా" తాగుతున్నారు. నలుగురూ వింటున్నారు. నవ్వకోయ్ నవ్వుతున్నాడు.

ఇంతలో హఠాత్తుగా ఓ ధృఢకాయుడు మాబాబే ప్రక్కన నిలబడి ఒక రివాల్వర్ అతని కణతలకి గురిచేశాడు. మాబాబే అదిరిపోయాడు. ఆ ధృఢ కాయుడు ట్రిగ్గర్ నొక్కాడు. రాబే దరిదాపు మూర్ఛపోయాడు. రివాల్వర్ గుండ్లు లేనట్టుగా ఠప్‌మంది, నీరసించి నిట్టూర్పు విడిచాడు పోబే. అందరూ హాయిగా నవ్వుకున్నారు. ధృఢకాయుడు వెళ్ళిపోయాడు.

రాబేపోబే పెద్దగా అరవసాగాడు. అర్వకోయ్ అతన్ని పట్టుకుని, "మిస్టర్ పోబే! దయచేసి శాంతించండి. ఇదేమి కుట్రగాదు, కుతంత్రం కాదు. ఇది ఇక్కడి ఒక వినోదం. దీనిని రష్యన్ రూలే (Russian Roulette) అంటారు. తుపాకీలో ఉంచే ఆరు అరల్లో ఐదు ఖాళీలు, ఒక గుండూ వుంటాయి. తుపాకి గురిపెట్టబడిన వ్యక్తి ముఖంలోని భావాలూ, అతను చేసే చేష్టలూ మిగిలిన వారికి వినోదం కలిగిస్తాయి కదా? ఆ ఉద్దేశ్యంలోనే మా దేశంలో ఈ ఆట ప్రారంభమైంది." అని నచ్చచెప్పాడు. మా బాబే ఏదో ఆలోచిస్తూ, "వినోదం కలిగించడం కోసమే అయితే ఆ ఒక్కగుండూ ఎందుకందులో?" అని అడిగాడు.

నవ్వకోయ్ చిరునవ్వు నవ్వాడు, "అది లేకపోతే థ్రిల్ ఏముంది?"

"ఒకవేళ పొరపాటున ఆ గుండు తగిలితే?" సూటిగా ప్రశ్నించాడు రాబే.

"సామాన్యంగా తగలదు" చెప్పాడు అర్వకోయ్

"ఒకవేళ తగిలితే?" రెట్టించాడు పోబే

గంభీరంగా నలుగురికేసి చూశాడు నవ్వకో,యర్వకోయ్ "చెప్పేదేముంది. ఇంతేసంగతులు, చిత్తగించవలెను." నలుగురూ తల పంకించారు. మాబాబే రాబేపోబే దీర్ఘంగా ఆలోచిస్తూ ఉండిపోయాడు.

★ ★ ★



కొద్దినెలల తరువాత లుసాకాలో నవ్వకో యర్వకోయ్ గౌరవార్థం ఒక విందు ఏర్పాటు చేయబడింది. విందులు, వినోదాలు అన్నీ అయిపోయాయి. అందరూ నిశ్శబ్దంగా

చూస్తున్నారు. మాబాబే వినయంగా అర్వకోయ్‌తో కరచాలనం చేస్తూ, "మిస్టర్ నవ్వకో యర్వకోయ్! లోగడ నేను మీ దేశం వచ్చినప్పుడు మీరు మీ రష్యన్ రూలే ఆట చూపించారు. దాని సాయంతో ఇక్కడి మా నిపుణులు ఆఫ్రికన్ రూలే ఆట రూపొందించారు. చూస్తారా?" అని అడిగాడు.

అర్వకోయ్ మొదట కొద్దిగా తెల్లముఖం వేసినా వెంటనే తేరుకుని గంభీరంగా, "తప్పకుండా చూస్తాను" అన్నాడు. వెంటనే ప్రక్కనే ఉన్న గది తలుపులు తెరవబడ్డాయి. లోపల ఆరుగురు ఆఫ్రికన్ యువతులు, కళ్ళు మిరుగొట్లు గొలిపే లావణ్య వతులు, దరిదాపు నగ్నంగా, వివిధ భంగిమలలో నిలబడి వున్నారు. మంత్రముగ్ధుడల్లే ఒకడుగు లోపలికి వేశాడు నవ్వకోయ్.

వెనుక నుంచి మాబాబే అన్నాడు. "మిస్టర్ అర్వకోయ్! ఈ మెరుపు తీగల్లో మీకు నచ్చిన వారిని ఒకరిని ఎంచుకోవచ్చు. ఆమె రాత్రికి మిమ్మల్ని స్వర్గ వీధుల్లో విహరింపజేస్తుంది.

నవ్వకోయ్ నవ్వాడు, "మిస్టర్ పోబే! మీకు మా రష్యన్ రూలే సరిగ్గా అర్థమైనట్టు లేదు. ఇందులో మీకు థ్రిల్ ఏముంది?"

మా బాబే వెంటనే అందుకున్నాడు. "తొందరపడకండి మిస్టర్ నవ్వకోయ్! దానికి పదింతలు థ్రిల్ ఉంది, ఇందులో వీరిలో ఒక యువతి మాత్రమే శృంగారవతి, మిగిలిన ఐదుగురూ నరమాంస భక్షకురాళ్ళు జాగ్రత్త!".

నవ్వకో యర్వకోయ్ వెనుక తలుపులు భళ్ళున మూసుకున్నాయి.